## గొంతులో పల్లిగింజ ఇరుక్కొని బాలుడి మృతి


అక్షయ్(ఫైల్)


గూడూరు, మార్చి 9: గొంతులో పల్లిగింజ ఇరుక్కొని బాలుడు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం నాయకపల్లిలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన గుండెల కల్పన-వీరన్న దంపతుల 18 నెలల కుమారుడు అక్షయ్ శుక్రవారం ఇంట్లో పల్లీలు తింటుండగా గొంతులో గింజ ఇరుక్కోవడంతో కుటుంబ సభ్యులు నీరు తాగించారు. ఎక్కిళ్లతో బాధ పడుతుండగా స్థానిక దవాఖానకు, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లగా వైద్యులు పల్లి గింజను తొలగించారు. ఈ క్రమంలో అక్షయ్‌కు తీవ్ర జ్వరం, ఫిట్స్ రా వడంతో ఆదివారం మృతి చెందాడు.


పురాతన శివాలయ తోరణాన్ని పరిశీలిస్తున్న పరిశోధకులు

## కాకతీయ తోరణ ద్వారాన్ని పరిరక్షించాలి

### పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి

హనుమకొండ, మార్చి 9: కాకతీయుల మొదటి రాజధాని హనుమకొండ ప్రాంతంలోని అగ్గలయ్యగుట్ట సమీపంలోని కాకతీయ తోరణ ద్వారాన్ని పరిరక్షించాలని ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో ఈమని శివనాగిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. వరంగల్‌కు చెందిన పరిశోధకుడు అరవింద్ ఆర్యతో కలిసి ఆయన ఆదివారం హనుమకొండలో పర్యటించారు. ఈ సందర్భంగా శివనాగిరెడ్డి మాట్లాడుతూ అగ్గలయ్యగుట్ట సమీపంలోని ఈ తోరణం రోడ్డు నిర్మాణంలో భాగంగా నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన వ్యక్తంచేశారు. హనుమకొండ పద్మాక్షిగుట్ట వద్ద ఏర్పాటుచేసిన మొదటి దశ తోరణం వరంగల్ కోటలోని కాకతీయ కీర్తి తోరణ ద్వారాల కన్న ఎంతో ప్రాచీనమైనదని శివనాగిరెడ్డి తెలిపారు.



కరీంనగర్ ప్రాపర్టీ షోలో స్టాల్ నిర్వాహకులకు జ్ఞాపికలు అందిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వర్‌రావు. చిత్రంలో రియల్ ఎస్టేట్ సంస్థల ప్రతినిధులు, స్టాల్ నిర్వాహకులు


హనుమకొండ ఆటోషో ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

# ఆటో, ప్రాపర్టీషోలు గ్రాండ్ సక్సెస్

- 'నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో నిర్వహణ
- ప్రదర్శనలో ప్రముఖ కంపెనీలకు చెందిన కార్లు, బైకులు
- ఉత్సాహంగా పాల్గొని కొనుగోలు చేసిన వినియోగదారులు
- వరంగల్, కరీంనగర్, నిజామాబాద్‌లో అనూహ్య స్పందన


హనుమకొండ ఆటో షోలో స్కూటీని టెస్ట్ డ్రైవ్ చేస్తున్న శాసనమండలిలో విపక్షనేత సిరికొండ మధుసూదనాచారి


నిజామాబాద్ ప్రాపర్టీ షోలో స్టాల్ వద్ద వివరాలు తెలుసుకుంటున్న సందర్శకులు

హనుమకొండ చౌరస్తా, మార్చి 9 : హనుమకొండలోని కుడా హయగ్రీవాచారి గ్రౌండ్‌లో 'నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటోషో గ్రాండ్ సక్సెస్ అయ్యింది. రెండ్రోజులపాటు నిర్వహించిన షోలో ప్రముఖ కంపెనీలకు చెందిన కార్లు, బైక్‌లు, ఎలక్ట్రిక్ వాహనాలు, స్కూటర్లను ప్రదర్శనలో ఉంచారు. మారుతి సుజుకి, స్కోడా, విన్ టీవీఎస్, విన్ మోటార్స్, కియా మోటార్స్, ఆదర్శ మోటార్స్, ఆదర్శ నెక్సా, గ్రీన్ హోండా, హ్యాపీ ఆటోమోటివ్ యమహా, ప్రైడ్ సిట్రోన్, రాంగ్రూప్ ఎంజీ 100 యాజమాన్యాలు తమ లేటెస్ట్ కార్లు, బైక్‌లను ప్రదర్శనలో ఉంచాయి. వాహనదారుల కోసం ప్రత్యేక ఆఫర్లు, రాయితీపై పాత వాహనాలకు కొత్త వాహనాలు అందించేందుకు ముందుకొచ్చాయి. ఆదర్శ ఆటోమోటివ్స్(మారుతి సుజుకి), ఆదర్శ ఆటోవరల్డ్(నెక్సా), మహావీర్ స్కోడా, మాలిక్ కియా, రామ్‌గ్రూప్ ఎంజీ100, సిట్రోన్, హోండా, నియోన్ హుందాయ్, విన్ మోటార్స్, ఆదర్శ టీవీఎస్, ఆరుష్ ఆటోమోటివ్స్(ఏథర్), హ్యాపీ ఆటోమోటివ్స్(యమహా), చేతక్, రాయల్ ఎన్‌ఫీల్డ్(ఎస్వీ మోటార్స్), విన్ మోటార్స్(టీవీఎస్), ఐఆర్‌ఈవీ బైక్స్, ప్రణవ్ మోటార్స్, డీసీసీ బ్యాంక్ ప్రదర్శనతోపాటు బ్యాంకు రుణ సౌకర్యం అందుబాటులో ఉంచడంతో వాహనాలు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. ఆటోషోలో ప్రముఖ కంపెనీలకు చెందిన కార్లు, బైకులను టెస్ట్ డ్రైవ్ కోసం రయ్.. రయ్‌మంటూ చక్కర్లు కొట్టారు. తమకు నచ్చిన కార్లు, బైకుల గురించి తెలుసుకుని పెద్దఎత్తున కొనుగోలు చేశారు. ఆటో షోలో తమకు ఇష్టమైన వాహనాలను అందుబాటులో ఉంచడంతో 'నమస్తేతెలంగాణ-తెలంగాణ టుడే'కు కృతజ్ఞతలు తెలిపారు. ముగింపు కార్యక్రమానికి శాసనమండలిలో విపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ.. ఉద్యమనేత కేసీఆర్ తెలంగాణను అన్ని రంగాల్లో తీర్చిదిద్దారని కొనియాడారు. రాష్ట్రాన్ని సాధించడంలో 'నమస్తే తెలంగాణ' గుణాత్మకపాత్ర పోషించడంతోపాటు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ రోజుల్లో వాహనం ప్రతి ఒక్కరికీ నిత్యావసరంగా మారిందని పేర్కొన్నారు. మాజీ మంత్రి యర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. 'నమస్తే తెలంగాణ' తెలంగాణ గుండె చప్పుడు అని పేర్కొన్నారు. వివిధ సంస్థలు కొత్త కొత్త కార్లు, బైకులను ఒకే గొడుగు కిందకు తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించిన 'నమస్తే తెలంగాణ-తెలంగాణటుడే'కు అభినందనలు తెలిపారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నమనేని జగన్మోహన్‌రావు మాట్లాడుతూ.. 'నమస్తేతెలంగాణ-తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో ఆటోషో ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. హైదరాబాద్ తర్వాత పెద్ద నగరమైన వరంగల్‌లో ఇలాంటి ఆటోషోలు నిర్వహించడం వినియోగదారులకు గొప్ప వరమని కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి పేర్కొన్నారు. అనంతరం స్టాళ్ల సందర్శనకు వచ్చినవారికి ప్రోత్సాహక బహుమతులు, స్టాళ్లను ఏర్పాటుచేసిన కంపెనీ ప్రతినిధులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో నమస్తే తెలంగాణ బ్రాంచ్ మేనేజర్ పందిళ్ల అశోక్‌కుమార్, బ్యూరో ఇన్‌చార్జి పిన్నింటి గోపాల్, మార్కెటింగ్ మేనేజర్ అప్పని సూరయ్య, సర్క్యులేషన్ మేనేజర్ ఎడెల్లి సురేశ్‌రెడ్డి, ఆదర్శ ఆటోమోటివ్స్ జనరల్ మేనేజర్ కేఎస్ కల్యాణ్, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ వరంగల్ కార్యదర్శి పీఎస్ ఫణికుమార్, హనుమకొండ కార్యదర్శి డాక్టర్ సీహెచ్ ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులు రఘుపతిరెడ్డి, సురేశ్‌కుమార్, కృష్ణార్జునరావు, మధుసూదన్‌రెడ్డి, కార్తీక్ పాల్గొన్నారు.

## కరీంనగర్ ప్రాపర్టీషోకు అనూహ్య స్పందన..

కరీంనగర్ కార్పొరేషన్: కరీంనగర్ జిల్లా కేంద్రంలో 'నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో రెండ్రోజులపాటు నిర్వహించిన ప్రాపర్టీ షోకు అనూహ్య స్పందన లభించింది. షోకు నగరంతోపాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ప్రాపర్టీల వివరాలు తెలుసుకునేందుకు ఆసక్తి చూపారు. రాష్ట్రంలోని పలు ప్రముఖ సంస్థలతో పాటు జిల్లాకు చెందిన వివిధ రియల్ సంస్థలు, బిల్డర్స్, బ్యాంకులు, సోలార్ సంస్థలు, బ్యాంకులు స్టాల్స్ ఏర్పాటు చేయగా విశేష స్పందన లభించింది. రెండ్రోజుల్లో సుమారు 1200 మంది సందర్శించారు. పలువురు వినియోగదారులు తమకు నచ్చిన వాటిని బుక్ చేసుకున్నారు. ఈ షోను శనివారం కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ ప్రారంభించగా, ఆదివారం ముగింపు కార్యక్రమానికి కరీంనగర్ జిల్లా టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఆఫీసర్ ఆంజనేయులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బండ గోపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇలాంటి షోలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. 'నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో కరీంనగర్‌లో ప్రాపర్టీ షో నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నమస్తే తెలంగాణ కరీంనగర్ బ్రాంచి మేనేజర్, బ్యూరో ఇన్‌చార్జి కే ప్రకాశ్‌రావు, యాడ్స్ మేనేజర్ రేణ మల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## నిజామాబాద్‌లో భారీగా సందర్శకులు..

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వేణుమాల్‌లో 'నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రాపర్టీ షో ఆదివారం ముగిసింది. ప్రాపర్టీ షో గ్రాండ్ సక్సెస్ అయ్యింది. నిజామాబాద్, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ డెవలపర్స్, రియల్ ఎస్టేట్ సంస్థలు తరలివచ్చాయి. పెద్దసంఖ్యలో తరలివచ్చిన సందర్శకులు తమకు ఇష్టమైన ప్రాపర్టీల కొనుగోలుకు ఆసక్తిచూపారు. ఇంతటి అద్భుతమైన కార్యక్రమాన్ని నిర్వహించిన 'నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే'ను సందర్శకులు అభినందించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ధర్మరాజు, బ్యూరో ఇన్‌చార్జి రమేశ్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

---

చిత్రం



## అనుకోని అతిథికి మెగా సత్కారం

ఈ స్టిల్ చూసినవారంతా.. మెగాస్టార్ 'విశ్వంభర'లో శ్రీలీల స్పెషల్ సాంగ్ చేస్తున్నదా? అనే డౌట్ రాక మానదు. అసలు విషయం ఏంటంటే.. చిరంజీవి 'విశ్వంభర' షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ అన్నపూర్ణ ఏడెకరాల్లో జరుగుతున్నది. అదే స్టూడియోలో మరో షూటింగ్‌లో ఉన్న శ్రీలీలకు.. పక్క సెట్‌లో మెగాస్టార్ ఉన్నారని తెలిసింది. అంతే.. ఆనందం ఆపుకోలేక 'విశ్వంభర' సెట్‌లోకి ఎంట్రీ ఇచ్చేసింది శ్రీలీల. చిరంజీవిని కలిసి పాద నమస్కారం చేసేసింది. మహిళా దినోత్సవం రోజున అనుకోకుండా వచ్చిన ఈ అతిథిని మెగాస్టార్ గౌరవంగా శాలువా కప్పి సత్కరించారు. అంతేకాక దుర్గాదేవి రూపం ముద్రించిన ఓ శంఖాన్ని కూడా బహూకరించారు. మెగాస్టార్ నుంచి ప్రత్యేకమైన బహుమతిని అందుకున్న శ్రీలీల.. ఆనందం వ్యక్తం చేస్తూ.. చిరంజీవితో ఉన్న ఫొటోలను తన సోషల్ మీడియా అకౌంట్‌లో షేర్ చేశారు. అదనమాట విషయం.



## మంచుకొండల్లో పోరాటం

'అఖండ' సినిమా బాలకృష్ణ కెరీర్‌కి మేలి మలుపు. ఎందుకంటే.. అక్కడ్నుంచి మొదలైన బాలయ్య విజయవిహారం ఇంకా అప్రతిహతంగా కొనసాగుతూనే ఉంది. లైన్లో నాలుగు హిట్లను ఆపకుండా కొట్టారు బాలయ్య. ఇప్పుడు అయిదో హిట్ కోసం 'అఖండ 2- తాండవం' సినిమాని రెడీ చేస్తున్నారు. దాంతో ఈ సినిమాపై అంచనాలు ఆకాశంలో ఉన్నాయి. దర్శకుడు బోయపాటి శ్రీను ఎంతో ప్రస్టేజియస్‌గా పానిండియా స్థాయిలో సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. వచ్చే వారం నుంచి హిమాలయాల్లో షూటింగ్ ప్లాన్ చేశారు బోయపాటి. ఇందులో మురళీకృష్ణగా, అఖండ రుద్రసికిందర్ అఘోరాగా రెండు విభిన్నమైన పాత్రల్ని బాలయ్య పోషిస్తున్న విషయం తెలిసిందే. రేపు హిమాలయాల్లో అఖండ రుద్రసికిందర్ అఘోరా పాత్రపై కీలక సన్నివేశాలను తీస్తారట. ప్రేక్షకుల్ని రోమాంచితం చేసేలా ఈ సన్నివేశాలుంటాయని చిత్రబృందం చెబుతున్నది. ఈ షెడ్యూల్‌లో బాలకృష్ణతోపాటు కీలక పాత్రధారులంతా పాల్గొంటారట. 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రానికి థమన్ సంగీతాన్ని సమకూరుస్తున్న విషయం తెలిసిందే.



## లక్ష్యాన్ని ముద్దాడేదాకా వెనకడుగేయను

'నా పదిహేనేళ్ల ప్రయాణం ఓ పాఠం.. ఆ పాఠం నుంచి పోరాటం నేర్చుకున్నా.' అంటున్నారు అగ్రనటి సమంత. తన కెరీర్ పదిహేనేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, గడచిన కాలం గురించీ, భవిష్యత్తులో తీసుకోబోయే నిర్ణయాల గురించి సోషల్ మీడియాలో స్పందించారు సమంత. 'అపజయాలు ఎదురైనప్పుడు కెరీర్‌ను సవాలుగా తీసుకోవడం మామూలే. కానీ నేను విజయాలను సవాలుగా తీసుకుంటా. ఓ విజయం దక్కితే.. దాన్ని మించిన విజయం కోసం శ్రమిస్తా. అదే నా సక్సెస్ వెనుక ఉన్న రహస్యం' అని తెలిపారు సమంత. 'ఇక నుంచి కొత్త సమంతను చూస్తారు. నా ప్రయాణంలో అనుకున్న లక్ష్యాన్ని ముద్దాడే దాకా వెనుకంజ వేయను. నా ప్రయాణం భావితరాలకు పాఠం కావాలి. ఓ స్త్రీగా నాకంటూ చరిత్రలో కొన్ని పేజీలుండాలి.. అదే నా లక్ష్యం. దాని కోసం ఇకనుంచి నా పోరాటం నిరంతరాయంగా సాగుతూనే ఉంటుంది.' అంటూ పేర్కొన్నారు సమంత. మహిళా దినోత్సవం నేపథ్యంలో ఆమె ఇచ్చిన ఈ స్టేట్మెంట్ చూసినవారంతా.. సమంతలో ఓ పొలిటికల్ లీడర్‌ని చూస్తున్నారు. భవిష్యత్‌లో పాలిటిక్స్‌లోకి వెళ్తుందేమో.. అంటూ కామెంట్లు కూడా పెడుతున్నారు. కొందరైతే 'తలైవీ..' అంటూ ఏకంగా జయలలితతో పోల్చేస్తున్నారు.

## ముచ్చటగా మూడోసారి?..



గత ఏడాది సంక్రాంతికి వచ్చిన 'నా సామిరంగ' తర్వాత అగ్రహీరో అక్కినేని నాగార్జున నుంచి సినిమా రాలేదు. ప్రస్తుతం ఆయన ధనుష్ 'కుబేర', రజనీకాంత్ 'కూలీ' చిత్రాల్లో ప్రత్యేక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాలు త్వరలో విడుదల కానున్నాయి. అయితే.. సోలో హీరోగా ఆయన చేసే సినిమా కోసం అక్కినేని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. నాగ్ కూడా ప్రసుతం కథలు వినే పనిలోనే ఉన్నారని తెలుస్తున్నది. ఇదిలావుంటే.. రీసెంట్‌గా నాగ్‌కి డైరెక్టర్ పూరీ జగన్నాథ్ ఓ కథ వినిపించారట. నాగార్జునకు కూడా ఆ కథ బాగా నచ్చిందని సమాచారం. గతంలో వీరిద్దరి కాంబినేషన్లో 'శివమణి', 'సూపర్' సినిమాలు వచ్చాయి. వాటిలో 'శివమణి' బాగా ఆడింది. ఇప్పుడు ముచ్చటగా మూడోసారి వీరిద్దరూ కలవనున్నారని ఫిల్మ్ వర్గాల సమాచారం. ప్రసుతం పూరీకి హిట్ వాంటెడ్. మరి నాగార్జున కోసం ఆయన ఏ తరహా కథ రెడీ చేశారో.. ఈ సినిమాను ఏ నిర్మాత నిర్మిస్తాడో, అసలు ఇందులో వాస్తవాలెన్నో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

## రామరావణ సంగ్రామం మొదలైంది



నితేష్ తివారి 'రామాయణం' షూటింగ్ ముంబైలో శరవేగంగా జరుగుతున్నది. ఇటీవలే నితేష్ ఓ కీలక షెడ్యూల్‌ని పూర్తి చేశారు. శ్రీరాముడి పాత్ర పోషిస్తున్న రణబీర్‌కపూర్, రావణ పాత్ర పోషిస్తున్న యష్‌లపై ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. తదుపరి షెడ్యూల్ వచ్చేవారం నుంచి ముంబైలోనే మొదలు కానుంది. ఈ షెడ్యూల్‌లో యష్‌తో పాటు ప్రధాన తారాగణమంతా పాల్గొనగా, భారీ యుద్ధ సన్నివేశాలను చిత్రీకరిస్తారు. సీతగా సాయిపల్లవి నటిస్తున్న ఈ సినిమాలో సన్నీ డియోల్, రకుల్ ప్రీత్‌సింగ్, లారా దత్తా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక పానిండియా సినిమా రెండు భాగాలుగా రూపొందుతున్న విషయం తెలిసిందే. తొలి భాగాన్ని వచ్చే ఏడాది దీపావళికి, మలి భాగాన్ని 2027 దీపావళికి విడుదల చేయనున్నారు. యష్ రాజ్ ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది.

## పెళ్లిపీటలెక్కనున్న అభినయ



నటి అభినయ పెళ్లిపీటలెక్కనున్నారు. ఈ శుభవార్తను తన ఇన్‌స్టా ద్వారా ప్రపంచానికి తెలియజేశారామె. తనకు కాబోయే భర్తతో కలిసి గుడి గంటను మ్రోగిస్తూ.. చేతులు మాత్రమే కనిపిస్తున్న తమ ఎంగేజ్‌మెంట్ పిక్‌ని ఇన్‌స్టాలో షేర్ చేశారు అభినయ. 'ఆశీర్వదించండి.. ఈ రోజు నుంచి కొత్త జీవితం మొదలు కానుంది.' అంటూ కామెంట్‌ని కూడా జత చేశారు. అయితే.. తాను పెళ్లాడబోయేది ఎవర్ని? అనే విషయాన్ని మాత్రం రివీల్ చేయలేదు. నటిగా ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించారు అభినయ. స్ఫూర్తిదాయకమైన జీవితం ఆమెది. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, శంభో శివశంభో చిత్రాలు ఆమెకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టాయి. రీసెంట్‌గా విడుదలైన మలయాళ చిత్రం 'పని' నటిగా ఆమెను మరోస్థాయిలో నిలబెట్టింది. అలాంటి మంచి నటి.. వైవాహిక జీవితంలోకి అడుగుపెడుతున్నానని పోస్ట్ పెట్టడంతో, శుభాకాంక్షలు వెల్లువెత్తాయి.

## సోషల్ మీడియా నేపథ్యంలో



రామ్‌గోపాల్‌వర్మ దర్శకత్వ పర్యవేక్షణలో రూపొందిన చిత్రం 'శారీ'. గిరికృష్ణ కమల్ దర్శకుడు. రవిశంకర్ వర్మ నిర్మాత. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ సైకలాజికల్ థ్రిల్లర్‌లో సత్య యాదు, ఆరాధ్యదేవి హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ నెల 21న పానిండియా స్థాయిలో సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా మేడ్చల్‌లోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్స్ కళాశాల విద్యార్థులతో చిత్ర బృందం ఇంటరాక్ట్ అయ్యారు. అగ్రదర్శకుడు రామ్‌గోపాల్ వర్మ, హీరోహీరోయిన్లు సత్య, ఆరాధ్యదేవి, నిర్మాత రవిశంకర్‌వర్మ, రామ్‌గోపాల్‌వర్మ సోదరి విజయ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రస్తుత సమాజంపై సోషల్‌మీడియా ప్రభావం ఎంతవరకు ఉంది అనే విషయంపై విద్యార్థుల అభిప్రాయాలను చిత్రబృందం తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెండువేల మంది విద్యార్థులు, కాలేజీ యాజమాన్యం, అధ్యాపకులు పాల్గొన్నారు. సమాజంపై సోషల్‌మీడియా విష ప్రభావం ఎలాంటి పరిణామాలకు దారితీస్తున్నది? అనే అంశంపై తీసిన సినిమానే 'శారీ' అనీ, నిజజీవిత సంఘటనల ఆధారంగా ఈ సినిమా చేశామని రామ్‌గోపాల్‌వర్మ తెలిపారు. ఇంకా చిత్ర యూనిట్‌సభ్యులంతా మాట్లాడారు.

## అలాంటప్పుడు విడిపోవడం బెటర్



పెళ్లి కాకముందే బెస్ట్ కపుల్స్ అనిపించుకున్నారు తమన్నా, విజయ్‌వర్మ. అయితే.. ఇప్పుడు హటాత్తుగా ఇద్దరూ విడిపోయారనే వార్తలు మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. అయితే.. ఈ విషయాన్ని వారు మాత్రం ధృవీకరించలేదు. అయితే.. ఇటీవలే ఓ కార్యక్రమంలో మీడియాతో మాట్లాడుతూ తమన్నా మాట్లాడిన మాటలు.. వారి బ్రేకప్‌కు బలాన్నిస్తున్నాయి. 'ప్రేమలో స్వేచ్ఛ ఉండాలి. కట్టడి ఉండకూడదు. ప్రేమలో ఎమోషన్స్ ఉండాలి. అంచనాలు ఉండకూడదు. అలా వుంటే అది ప్రేమకాదు. వ్యాపారం అవుతుంది. ఎప్పుడైతే ప్రేమ వ్యాపారంలా మారుతుందో.. అప్పుడు కలిసి ఉండటం కంటే విడిపోవడం బెటర్.' అంటూ స్పందించింది తమన్నా. ఆమె మాటలు విన్న వారంతా బ్రేకప్ విషయంపై ఓ అభిప్రాయానికి వచ్చేస్తున్నారు.